క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఆట వస్తువులు అందజేస్తున్న మౌనిష్‌రెడ్డి

తలమడుగు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సమాజిక కార్యకర్త పిడుగు మౌనిష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బరంపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఆట సామగ్రి అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు చదువులో, క్రీడల్లో ఆసక్తి ఉన్నప్పటికీ క్రీడా పరికరాలు లేక రాణించలేకపోతున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవాలకు టీకాలు వేయించాలి

నేరడిగొండ: మేకలు, గొర్రెలకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. గురువారం మండలంలోని బొందిడి, తర్నం(కె), వాంకిడి గ్రామాల్లో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఈనెల 20 వరకు సాగుతుందన్నారు. పాడి రైతులు మేకలు, గొర్రెలకు టీకాలు వేయించాలని సూచించారు.

కూలిపోయిన ఇంటి పైకప్పు

ఇంద్రవెల్లి: భారీ వర్షానికి ఇంటి పైకప్పు కూలిన ఘటన గురువారం మండలంలోని పర్ధాన్‌గూడ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడ గ్రామానికి చెందిన గేడం హీరమాన్, కమలబాయి దంపతులు గుడిసెలో ఉంటూ.. జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటి పైకప్పు తడిసి కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

బీజేపీ నాయకుల అరెస్ట్

నార్నూర్: జైనూర్‌లో మహిళపై అత్యాచారం, హత్యయత్నానికి పాల్పడిన నిందితుడికి ఉరితీయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రం నుంచి జైనూర్ బయలుదేరిన బీజేపీ నాయకులు రాథోడ్ బాబూలాల్, రాథోడ్ భిక్షపతి, తొడసం బండు, ధర్మ రక్షక్ రామ్ నివాస్‌లను పోలీసులు గాంధీచౌక్ వద్ద అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. బాధిత కుటుంబానికి పరామర్శించడానికి వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నిందితుడికి ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవిదాస్, రవీందర్, తదితరులు ఉన్నారు.

కస్తూరిబా పాఠశాల పరిశీలన

సిరికొండ: మండలంలోని కస్తూరిబా పాఠశాలను గురువారం మండల మెడకల్ ఆఫీసర్ హిమబిందు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎస్‌వో సంధ్యారాణిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం వంటగదిని, సరుకులను పరిశీలించారు.

ప్రముఖుల పూజలు

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, జిల్లా సబ్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్‌లు వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం జైనథ్‌కు చేరుకొని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు గావించారు. ఆలయ అధికారులు వారిని శాలువాలతో సన్మానించి, స్వామి వారి చిత్రపటం బహుకరించారు.

ఉచిత విద్యుత్ వినియోగించుకోవాలి

ఇచ్చోడ: ప్రభుత్వం అందచేస్తున్న ఉచిత విద్యుత్ ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ముఖరా(కె)లో గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన వారికి ఉచితంగా 200ల యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందజేస్తున్నారు. మీటర్లు లేని వారికి ప్రభుత్వం నేరుగా రూ. 930కి మీటరు అందచేస్తున్నట్లు తెలిపారు. 20 మంది వినియోగదారులు రూ. 930 చొప్పున డీఈకి డబ్బులు అందచేశారు. కార్యక్రమంలో ఏఈ రాజు, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, జూనియర్ లైన్‌మెన్ మల్లేష్ పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గురువారం పరామర్శించారు. మండలంలోని సుర్దాపూర్ గ్రామానికి చెందిన సుభాష్, వడూర్ గ్రామానికి చెందిన తేలు గంగాధర్ తల్లి, అదే గ్రామానికి చెందిన కారగిరి సురేశ్ తల్లి ఇటీవల మరణించడంతో వారి ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు.



తలమడుగు: సుంకిడిలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నార్నూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పవార్ అనిత, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదన్నారు.

ఇచ్చోడ: మేడిగూడ ఆశ్రమ పాఠశాలలలో ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖరా(బి) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కోకస్‌మన్నూర్, గేర్జం, నర్సాపూర్,మాదపూర్, బోరిగామ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్న భాగ్యలక్ష్మి

నేరడిగొండ: టీచర్స్ డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న భాగ్యలక్ష్మి అవార్డు అందుకున్నారు. గురువారం ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్ కార్యాలయము బాసర జోన్ పరిధిలోని గురుకుల పాఠశాలల నుంచి పలువురిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సీవోఈ ఆదిలాబాద్ ప్రిన్సిపాల్ లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బాసర జోన్ నుంచి జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా లలిత కుమారి, ఉత్తమ ఉపాధ్యాయుల కేటగిరిలో (బి) రమణిక, ఆర్ వేలంకన్ని, గోదావరి, తదితరులు ఉన్నారన్నారు.



అవార్డుతో సత్కరిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే



నార్నూర్: జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాలలో..

సిరికొండ: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయంగా తోటి విద్యార్థులకు బోధించారు.

ఆదిలాబాద్: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సాలోమన్ అన్నారు. ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్ ఉన్నారు.



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తలమడుగు: మండలంలోని సుంకిడి,కజర్ల, దేవాపూర్, బరంపూర్, పల్లి, కుసులాపూర్, లింగి, ఖోడద్, కొత్తూరు, పల్లి(బి), గ్రామాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు, రామేశ్వర్, కష్ణకుమారి, రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, రామ్ రెడ్డి, సుకుమార్, సుజాత, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.



తాంసి కళాశాలలో..



సిరికొండ: ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రీజనల్ మేనేజర్

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. గురువారం మండలంలోని ముఖరా(కె) గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రెండు లక్షల రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. వివిధ కారణలతో కొంత మంది రైతులకు రేషన్‌కార్డులేక పోవడంతో రుణమాఫీ కాలేదన్నారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో సెల్ఫీ దిగి యాప్‌లో ఆప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సాయిరాం, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో జాదవ్ కైలాస్

నేరడిగొండ: రైతులకు రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల రైతువేదికల వద్ద సంబంధిత శాఖ అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. గురువారం మండలంలోని కుమారి రైతువేదిక వద్ద వివిధ గ్రామాల రైతులు అక్కడికి చేరుకొని సంబంధిత అధికారుల వద్ద పేర్లను నమోదు చేయించుకున్నారు. ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

తాంసి: ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామ శివారులో పెన్‌గంగ బ్యాక్ వాటర్ వరదలతో దెబ్బతిన్న పంటలను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, పార్లమెంటరీ నేత ఆత్రం సుగుణతో కలిసి పరిశీలించారు. వరద కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, సర్వే చేసి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.



పంటలు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో నాయకులు పోతారెడ్డి, రమేశ్, శ్రీనివాస్, అన్నుపటేల్, సుదర్శన్, అమర్ రెడ్డి, అఫ్రోజ్ పాల్గొన్నారు.

స్థలం పత్రాలు అప్పగింత

సిరికొండ: మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించేందుకు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ స్థలంను గురువారం మండల మెడికల్ ఆఫీసర్ హిమబిందు పరిశీలించారు. స్థలంకు సంబంధించిన పత్రాలను రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు వైద్యాధికారులకు అప్పగించారు. త్వరలోనే టెండర్ పలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ విలాస్, సర్వేయర్ గణేష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, హెల్త్ అసిస్టెంట్ గంగారం, మాజీ సర్పంచ్ పెంటన్న, తదితరులు పాల్గొన్నారు.



స్థలం పత్రాలు అప్పగిస్తున్న అధికారులు

కఠిన చర్యలు తీసుకుంటాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై అఘాత్యానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకొని జైలుకు పంపారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. జైనూర్ మండలం కేంద్రంలో బుధవారం జరిగిన ఘటన బాధాకరమన్నారు. ఇరువర్గాలు సంయమనం పాటించాలన్నారు. ఆదివాసీలను అడ్డం పెట్టుకొని కొందరు ప్రశాంతవంతమైన వాతావరణాన్ని చెడగొట్టే కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఘటనలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు హస్తం ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

6న ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈనెల 6న ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ అండర్- 14 బాలికల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ సిహెచ్. కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2011 జనవరి 1 తర్వాత జన్మించి, 48 కేజీల లోపు బరువు ఉన్న బాలికలు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రుపత్రం, బోనఫైడ్‌తో ఉదయం 10 గంటలకు పోటీల కన్వీనర్, ఆర్గనైజర్ హెచ్ఎం శ్రీనివాస్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపిక పోటీలకు ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినుల చొప్పున హాజరయ్యేలా పీఈటీలు చూడాలని పేర్కొన్నారు. వివరాలకు 94935 34163సంప్రదించాలని కోరారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జిల్లా పర్యటనలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పాల్సింది పోయి మంత్రితో కలిసి ఎమ్మెల్యే సీసీఐను సందర్శించారని అన్నారు. ప్రైవేట్ పెద్దలకు సీసీఐను అప్పజెప్పి కమీషన్లు రాబట్టుకోవాలనే ఆలోచనను మానుకోవాలని హితవు పలికారు.

ప్రతిభను వెలికితీసేందుకు కృషి

తలమడుగు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నామని ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం భరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారుల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రత్యూష, మౌనిషరెడ్డి, మహేందర్ యాదవ్, రవి జాదవ్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ఇంద్రవెల్లి: భారీ వర్షాల కారణంగా కోతకు గురైన రోడ్డు, కల్వర్టులకు డీఆర్‌డీవో సాయన్న ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ అధికారులు మరమ్మతులు చేశారు. గురువారం మండలంలోని గిన్నేర గ్రామ పంచాయతీ పరిధిలోని కోతకు గురైన మర్కగూడ కల్వర్టు, వడగామ్ గ్రామపంచాయతీ పరిధిలోని పాటగూడ వాగు వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేసి, పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షారిణ సుల్తాన, రవీందర్ పాల్గొన్నారు.



కల్వర్టుకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: రేపటి నుంచి ప్రారంభం కానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆదిలాబాద్ పట్టణంలో ఘనంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎండి.ఖమర్ అహ్మద్ అన్నారు. వినాయక నిమజ్జనం జరిగే జైనథ్ మండలం డోల్లార సమీపంలోని పెన్‌గంగ నది పరిసరాలను బల్దియా అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే దానిపై వారితో చర్చించి పలు సూచనలు చేశారు. భారీ క్రేన్‌లతో పాటు లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లుగా తెలిపారు. వర్షాలకు పట్టణంలోని వివిధ కాలనీల్లోని రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చే పనులు ఇప్పటికే ప్రారంభించినట్లుగా తెలిపారు. గణేశ్ మండపాల నిర్వాహకులు బల్దియా అధికారులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట డీఈలు తిరుపతి, కార్తీక్, ఎస్సై శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు ఉన్నారు.



పెన్‌గంగను పరిశీలిస్తున్న కమిషనర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని బుద్దికొండ, కొర్టికల్ గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు. పురవీధుల గుండా మురుగు కాల్వల్లో ఉన్న చెత్తాచెదారాన్ని కార్మికుల ద్వారా తొలగించారు. గృహ సముదాయాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. తాగునీటిని వేడి చేసిన అనంతరం చల్లార్చి తీసుకోవాలని, అలాగే వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు రాజురెడ్డి, సునీల్ పాల్గొన్నారు.



నిల్వ నీటిని పారబోయిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నిందితుడిని వెంటనే ఉరి తీయాలి

నేరడిగొండ: ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యయత్నం చేసిన వ్యక్తిని ఉరి తీయాలని నేరడిగొండ తుడుందెబ్బ ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు సాంబన్న మాట్లాడారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు కోటేశ్వర్, పటేల్ భీంరావు, గణేష్, సీతారాం, ఆత్రం భీంరావు, తుకారాం పాల్గొన్నారు.

- వెంటనే నిందితుడిని ఉరి తీయాలని బీజేపీ నేరడిగొండ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ డిమాండ్ చేశారు. గురువారం పోలీసులు బీజేపీ నాయకులతో పాటు ఆయనను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్తే అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. నాయకులు గట్టు నారాయణ, జాదవ్ భీంరావు, రబడే జగదీష్ ఉన్నారు.

ఎదులాపురం: ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని వెంటనే ఉరితీయాలని ఆదిలాబాద్ రూరల్ మండలం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెస్రం కేశవ్, గెడం రాము డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా చూడాలన్నారు.

ఇచ్చోడ: దుండగుడిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘం నాయకులు కుమ్రకోటేశ్, ఆత్ర మహేందర్‌లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మాట్లాడారు. ఆదివాసీ మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు సిడాం దేవురావు, మాడవి భీంరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా నిర్లక్ష్యం కారణంగా మహిళలపై దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో కోరెంగా లక్కు, మెస్రం వసంత్‌రావ్, ఉయిక అఖిల్ పాల్గొన్నారు.

బంద్‌ను సహకరించాలి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లిలో నిర్వహించే బంద్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. అత్యాచారం చేసిన వ్యక్తిని ఉరి తీయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సోయం రాందాస్, గేడం భారత్, సోయం వినోద్, ఆత్రం హనుమంత్, గేడం ఉమేష్ పాల్గొన్నారు.

మండలాల్లో 144 సెక్షన్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో 144 సెక్షన్ విధించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా ఎస్సై దుబ్బక సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకు బీజేపీ మండలశాఖ పిలుపునివ్వడంతో పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నార్నూర్: ఆదివాసీ గిరిజన సంఘాల బంద్ పిలుపుమేరకు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. అలాగే 144 సెక్షన్ అమలులో ఉండడంతో గాదిగూడ, నార్నూర్ మండల కేంద్రాలు నిర్మానుష్యంగా మారింది. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితుడుకి ఉరిశిక్ష అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.



శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న ఎస్సై

ర్యాలీలు, సభలకు అనుమతులు లేవు

ఇచ్చోడ: ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ, నార్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ మండలాల్లో ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతులు లేవని ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా సభలు సమావేశాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలి

ఆదిలాబాద్: పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని సనాతన హిందూ సభ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకొని సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి రోజున మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద ఉదయం 8 గంటలకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. నిర్వాహకులు సైతం మట్టి వినాయక ప్రతిమలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, సభ్యులు రవీందర్, మాదస్తు సంతోష్, ఉపలంచివార్ కృష్ణ, దుర్వా సురేశ్, ప్రకాష్ రాథోడ్, దిలీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ ఖత్రి

కైలాస్‌నగర్: ఈనెల 7న సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లుగా ఆ సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రీ, గేడం మాధవ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాద పూర్వకంగా కలిసి మట్టి వినాయకుడి విగ్రహాన్ని అందజేశారు. విగ్రహాల పంపిణీకి రావాల్సిందిగా కలెక్టర్‌ను ఆహ్వానించారు.